క్లుప్తంగా

అంబేడ్కర్ గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

చుండూరు(వేమూరు): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కూరపాటి రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. మార్చి 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. 5వ తరగతి ఎంట్రన్స్ పరీక్ష ఏప్రిల్ 24వ తేదీ ఉదయం 10 గంటలకు, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పెదపులివర్రులో వైభవంగా యారోత్సవం

పెదపులివర్రు(భట్టిప్రోలు): స్థానిక భూనీళా సమేత వరదరాజస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం యారోత్సవం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను అర్చకులు దీవి శరత్ కుమార్, జగన్నాథ కృష్ణమాచార్యులు, రాంబాబు, పవన్‌కుమార్ నిర్వహించారు. స్వామి వార్లకు గ్రామానికి చెందిన గుంటూరు సాంబశివరావు పట్టు వస్త్రాలు, ముత్యాలతో కూడిన తలంబ్రాలు, నాదెళ్ల సాయికిరణ్ దంపతులు పేరిందేవి అమ్మవారికి రజత వడ్రాణం, నూతి రామలింగేశ్వర శర్మ వరదరాజస్వామి వారికి రజత దశావతారాలు, దీవి కృష్ణ ప్రసాద్ దంపతులు రజత ఆచమన పాత్ర సమర్పించారు. మంగళవారం రాత్రి రథోత్సవం జరుగుతుందని ధర్మకర్తల మండలి అధ్యక్షులు కంఠమనేని హరిప్రసాద్ తెలిపారు. కార్యక్రమాలను దేవస్థాన కార్యనిర్వాహణాధికారి మేకా సాంబశివరావు, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

కర్లపాలెం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎం.శివయ్య తెలిపారు. కర్లపాలెంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని ఆదివారం అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. వివరాలు.. కర్లపాలెం పంచాయతీ ఎంవీ రాజుపాలెం గ్రామానికి చెందిన అజిత్, నరసారెడ్డి వెదుళ్ళపల్లి గ్రామం నుంచి గంజాయి తీసుకువచ్చి కర్లపాలెంలో విక్రయిస్తున్నారని అందిన సమాచారం మేరకు నిఘా పెట్టి అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వీరి వద్ద ఉన్న 400గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

హుండీ కానుకల లెక్కింపు



తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల): దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసి యున్న మహంకాళి అమ్మవారి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు సోమవారం నిర్వహించినట్లు కార్యనిర్వహణాధికారి డీసీహెచ్ వెంకటరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానంలో హుండీలను లెక్కించగా రూ. 26,55,639 నగదు, 58 గ్రాముల బంగారం, 898 గ్రాముల వెండి వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని గుంటూరు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించగా దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త డి. రంగప్రసాద్, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారని తెలిపారు.

ఘనంగా ఉరుసు గంధ మహోత్సవం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): దుగ్గిరాల గ్రామంలోని కొత్తలాకుల సమీపంలో జెండా చెట్టు బజారులో వేంచేసి యున్న నాగేంద్రస్వామి పుట్ట వద్ద హజరత్ నాగుర్ మీరావలి 14వ జెండా ఉరుసు గంధ మహోత్సవాన్ని సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావులు విచ్చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంజి చిరంజీవి మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే సమాజంలో శాంతి, ప్రేమ వర్ధిల్లుతాయని అన్నారు. ప్రతి ఏటా నాగేంద్రస్వామి పుట్ట వద్ద ఉరుసు గంధ మహోత్సవం అత్యంత వేడుకగా నిర్వహిస్తూ ఆధ్యాత్మిక భావనలు పెంపొందిస్తున్నారని అన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరి రావు మాట్లాడుతూ సమాజంలో ఆధ్యాత్మిక భావనలు అవసరమని అన్నారు. పూజల అనంతరం జెండాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఉరుసు మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదానం నిర్వహించారు. రాష్ట్ర ఎనర్జీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అందే రాజేష్, ఆలయ కమిటీ నిర్వాహకులు పఠాన్ షాబుద్దీన్, అందే వెంకట శివకళ్యాణ్ పాల్గొన్నారు.

విషవృక్షాలు

- పొంచిఉన్న 'కోనో కార్పస్' ప్రమాదం
- పర్యావరణ, ఆరోగ్య సమస్యలూ వస్తాయ్



బుర్రిపాలెం రోడ్డులో ఏపుగా పెరుగుతున్న విషవృక్షాలు

తెనాలి: పర్యావరణ, వృక్ష శాస్త్రవేత్తలను భయపెట్టిన ఓ మొక్క తెనాలిలో విస్తృతంగా పెరుగుతోంది. ఆ మొక్క పేరు కోనో కార్పస్. తీరప్రాంతంలో పెరిగే మాంగ్రూస్ జాతి మొక్క. నిటారుగా శంఖు ఆకారంలో పెరుగుతోంది. చూడ్డానికి అందంగా, ఆకర్షణీయంగా ఉంటుంది. ఏడాది పొడవునా పచ్చగా ఉండటం ప్రత్యేకత! అంతవరకు అయితే బాగానే ఉంటుంది. ఈ మొక్కతో భూమ్మీద ఏ ప్రాణికీ ప్రయోజనం లేదు! ఈ చెట్టుపై పక్షులు వాలవు. గూళ్లు పెట్టవు. వీటి ఆకులను పశువులు తినవు. ఇక వీటి కాయలు తినేందుకు పనికిరావు. పూత కాయగా మారే క్రమంలో వీటినుంచి వెలువడే పుప్పొడి రేణువులు ఆస్తమా, అలర్జీలకు, శ్వాసకోశ వ్యాధులను కలిగిస్తాయట! వీటి బలమైన వేరు వ్యవస్థ భూగర్భ జలాలను అధికంగా తీసుకుంటుంది. అడ్డుగా ఉండే భూగర్భ పైప్‌లైనును, కేబుల్ వ్యవస్థను కూడా ధ్వంసం చేస్తాయి.

ఏడారి ప్రాంతాల్లో..

ఇసుక తుఫాన్‌కు అడ్డుగా నిలుస్తాయని, వేడిని తగ్గిస్తాయనీ, గార్డెనింగ్‌కు అనువుగా ఉంటాయని ఎడారి దేశాల్లో విస్తారంగా పెంచారు. తెలంగాణలో హరిత హారం కింద అక్కడి మున్సిపాలిటీల్లోని డివైడర్లు, కాలనీలు, గ్రామాల్లోనూ విస్తృతంగా నాటారు. ఇందుకు 2015లో గ్రామాల్లోని ప్రభుత్వ నర్సరీల్లో స్థానిక రకాలతోపాటు కోనో కార్పస్ మొక్కలను భారీగా పెంచారు. వీటి అనర్థాలను గుర్తించాక అంతా నాలుక్కరుచుకున్నారు. కోనో కార్పస్ మొక్కలను భారీగా పెంచిన ఏడారి దేశాలు వీటిని నిషేధించాయి. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఈ మొక్కలను పెంచొద్దని నిషేధం విధించింది.

తెనాలిలో ఎటుచూసినా కనిపిస్తున్నాయి...

2017-18 మధ్య కాలంలో అప్పటి ప్రభుత్వ హయాంలో నాటి మున్సిపల్ అధికారులు ఈ మొక్కలను తీసుకొచ్చారు. పెదరావూరు-స్థానిక వీఎస్సార్ కాలేజి మధ్య నాలుగు లేన్ల రహదారిలో నాటించారు. బుర్రిపాలెం రోడ్డులోని డివైడరులోనూ, పాలాద్రి కాల్వ తర్వాత పెట్రోలు బంకు అవతల ఇవి ఏపుగా పెరుడుతూ దర్శనమిస్తాయి. బోసుపోడ్డులోనూ ఇరువైపులా కోనో కార్పస్ మొక్కలు ఏపుగా ఇక్కడ పుష్పించి, కాయలు కూడా కాస్తున్నాయి. మున్సిపల్ అధికారుల పుణ్యమాని కొన్ని విద్యాసంస్థల ఆవరణలో, కొన్ని ప్రైవేటు ప్రదేశాల్లోనూ పెరుగుతున్నాయి. మున్సిపాలిటీ ఉద్యానశాఖ వర్కర్లు ఈ మొక్కలకు నీరు పోసి పెంచుతున్నారు.

ప్రభుత్వం ఆదేశిస్తే చెట్లు తొలగిస్తాం

కోనో కార్పస్ మొక్కలను తెనాలి పట్టణంలోని నాలుగు లైన్ల రహదారి, బుర్రిపాలెం రోడ్డులోని డివైడర్లలో 2017-18లో ఏర్పాటు చేసిన విషయం వాస్తవం. వాటి వలన ప్రజారోగ్యం దెబ్బతినే అవకాశం ఉందనే ప్రచారం నా దృష్టికి వచ్చింది. అందువలన ఇటీవల కోనో కార్పస్ మొక్కల కొమ్మలను తొలగించాం. ప్రభుత్వం ఆదేశిస్తే వాటిని పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో వేరే మొక్కలను ఏర్పాటు చేస్తాం.

– ఎం.జశ్వంతరావు, కమిషనర్, పురపాలక సంఘం

ఎస్సీల అభ్యున్నతికి కట్టుబడిన సీఎం జగన్



మంత్రి నాగార్జున, ఎమ్మెల్యే శివకుమార్‌ను గజమాలతో సత్కరించిన పార్టీ నాయకులు

తెనాలి: రాష్ట్రంలో ఎస్సీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారనీ, ఎస్సీల సంక్షేమం కోసం ఎన్నో విధాలుగా సాయపడుతున్నట్టు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు చెప్పారు. ఇటీవల తెనాలి సభలో రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్, పెట్టుబడి రాయితీలను విడుదల చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గంలోని ఎస్సీ శ్మశాన వాటికల అభివృద్ధికి రూ.9 కోట్ల నిధులు కేటాయించినట్లు గుర్తుచేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, పార్టీ ఎస్సీ విభాగం నేతలు కనపర్తి అనిల్, కొమ్ము రాయల్, కరాటపు రాజమోహన్, గోరికపూడి బాలరాజు, అక్కిదాసు కిరణ్‌కుమార్ మాట్లాడారు. తెనాలి సభలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చేసిన వినతికి అప్పటికప్పుడే సీఎం జగన్ స్పందించి ఎస్సీ శ్మశాన వాటికల విస్తరణకు నిధులు కేటాయించారని చెప్పారు. అనంతరం పార్టీ కార్యాలయానికి విచ్చేసిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌లను భారీ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అత్తోట నాగవేణి, దాసరి వీరవసంతరావు, మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ వంపుగళ్ల కృష్ణ, కోపల్లె ఎంపీటీసీ కారుమంచి కిషోర్, పార్టీ ఎస్సీ విభాగాల నాయకులు మేకల రవి కుమార్, నాలాది ప్రభాకర్, పినపాటి నిరంజన్, పినపాటి అనిల్, వేజండ్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

అనాథ శవాల అస్థికలు కాశీలో నిమజ్జనం

తెనాలి: అనాథ శవాలకు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న స్థానిక శ్రీశివలింగేశ్వరస్వామి భక్తబృంద సేవాసమితి అస్థికాలను కాశీలో నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. అస్థికలను సంస్థ అధ్యక్షుడు కుర్రా శ్రీను, సభ్యులు కలసి కాశీకి తీసుకొనివెళ్లారు. సోమవారం అక్కడి గంగానదిలో నిమజ్జనం చేసి, శాస్త్రోక్తంగా పిండప్రదానం చేశారు. 30 మందికి చెందిన అస్థికలను కాశీ క్షేత్రానికి తీసుకెళ్లి, అక్కి మణికర్ణికా ఘాట్ వద్ద నిమజ్జనం చేసినట్లు కుర్రా శ్రీను తెలిపారు. అక్కడే బ్రాహ్మణులకు అన్నదానం చేశారు. ఆయన వెంట తుల్లిమిల్లి చంటి, సేవాసమితి సభ్యులు ఉన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తెనాలి రూరల్: దాడి ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం.. పట్టణ చినరావూరు తోటకు చెందిన షేక్ మస్తాన్‌వలి, షేక్ గఫూర్ పక్కపక్కన ఇళ్లలో నివసిస్తుంటారు. ప్రహరీ నిర్మాణం విషయంలో ఘర్షణ పడడంతో మస్తాన్‌వలిపై గఫూర్, అతడి తరఫు వారు దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు సోమవారం నమోదు చేశారు.

గ్యాస్ ధరలు తగ్గించాలని వినతి

దావులూరు(కొల్లిపర): కేంద్రంప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచి మహిళలపై భారం వేసి నడ్డి విరుస్తుందని, ధరలు తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని దావులూరులో ఏప్రిల్5న జరిగే చలో ఢిల్లీ పిలుపును జయప్రదం చేయాలని కోరుతూ మహిళలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చే ముందు రూ.440లో ఉన్న గ్యాస్ బండ ప్రస్తుతం రూ.1160కు పెరిగిందని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధిహామీ పనులకు సంబంధించి రాష్ట్రానికి రావలసిన నిధులలో వెయ్యికోట్లు తగ్గించడంవలన రానున్న కాలంలో పనిదినాలు కూడా తగ్గిపోతాయని తెలిపారు. కార్యక్రమంలో సాంబశివరావు, ముక్కంటి పాల్గొన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు

తాడేపల్లిరూరల్: ఏప్రిల్ 5వ తేదీన చేపట్టి చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు అన్నారు. సోమవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని గుండిమెడ గ్రామంలో రైతు, కౌలురైతు సంఘం నాయకులతో కలసి చలో ఢిల్లీ కార్యక్రమం కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జొన్నా శివశంకర్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సంపద అంతా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పూనుకుందన్నారు. ఢిల్లీ కేంద్రంలో నల్ల చట్టాల రద్దు కోసం సంవత్సర కాలం పాటు రైతాంగ ఉద్యమం మహా ఉద్యమంలా కొనసాగిందని అన్నారు. ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకి రూ.600 కనీస వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. కేంద్రం అవలంబిస్తున్న రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న జరగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏపీ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, కేవీపీఎస్ నాయకులు జెట్టి రాంబాబు, సీఐటీయూ నాయకులు నల్లపు లెనిన్, తురక సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

తూటుకాడను తొలగించాలి

పంటపొలాలను నీరందించే గుంటూరు చానల్ పూర్తిగా తూటుకాడతో నిండిపోయిందని, తూటుకాడను తొలగించాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం నాయకులతో కలసి కొలనుకొండ వద్ద గుంటూరు చానల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లి మండలం ఉండవల్లి నుంచి పెదనందిపాడు వరకు సాగు, తాగునీరు అందిస్తున్న గుంటూరు చానల్ నేడు తూటుకాడతో నిండిపోయి ఉందని, అధికారుల నిర్లక్ష్యం వలన చానల్ పూడుకుపోయిందని అన్నారు. వెంటనే గుంటూరు చానల్‌ను శుభ్రం చేసి రైతుల పంటపొలాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఏపీ రైతుసంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, రైతుసంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బి.శివారెడ్డి, కాట్రగడ్డ శివ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాధా శ్యామసుందరుల విగ్రహ పునఃప్రతిష్ట

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి ఇస్కాన్‌లో రాధా శ్యామసుందరుల విగ్రహ పునఃప్రతిష్ట మంగళవారం నిర్వహించనున్నట్లు మందిర అధ్యక్షుడు చక్రధరి దాస్ సోమవారం ఒకప్రకటనలో తెలిపారు.

వైరల్ ఫీవర్.. టెన్షన్

రెండురోజులు జలుబు, పొడిదగ్గుతో ఉన్న ఓ ఆరేళ్ల చిన్నారికి రాత్రి తొమ్మిది గంటల సమయంలో తీవ్రమైన జ్వరం వచ్చింది. ఆక్సిజను శాచురేషను 95 మాత్రమే చూపుతోంది. గుండె తల్లడిల్లిన ఆ తల్లి ఆందోళనతో రాత్రికి రాత్రి విజయవాడలోని పిల్లల ఆసుపత్రికి తీసుకెళ్లింది. అడ్మిట్ చేసుకుని మూడురోజుల చికిత్స తర్వాత డిశ్చార్జ్ చేశారు. ఇది కేవలం ఆ చిన్నారికే పరిమితమైన సమస్య కాదు...



తెనాలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులు


తెనాలి: పట్టణ, పరిసర గ్రామాల్లో ఈ వైరల్ జ్వరాలు పిల్లలు, పెద్దలను వేధిస్తున్నాయి. తీవ్రమైన దగ్గు, ముక్కు కారటం, అధిక జ్వరం, కళ్ల మంటకు సంబంధించిన లక్షణాలతో ఎందరో బాధపడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్న రోగుల సంఖ్య పెరిగింది. ముందుగా శ్వాసకోశ సమస్యలు మొదలై, రెండు మూడు వారాలపాటు దగ్గుతో జ్వరం బారిన పడుతున్నారు. ఫ్లూకు కారణమయే వైరస్‌ల ఉపరకం ఇన్‌ఫ్లూయంజా హెచ్3ఎన్2తో ఈ జ్వరాలకు సంబంధం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఈ తరహా జ్వరం కేసుల పెరుగుదలపై 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్' (ఐసీఎంఆర్) ఆందోళన వ్యక్తంచేయటం తెలిసిందే. దీనితో వైద్య, ఆరోగ్య విభాగం అధికారులూ అప్రమత్తమయ్యారు.

కేసుల గుర్తింపుపై దృష్టి..

వైరల్ జ్వరాల కేసుల్ని గుర్తించటం, ఐసీఎంఆర్ సూచించిన ప్రకారం అవసరమైన చికిత్సను అందించటంపై వైద్య, ఆరోగ్యశాఖ దృష్టి పెట్టింది. ఈ సీజనులో ఆస్పత్రిలో చేరేవారి సంఖ్య పెరుగుతుందని అంచనా ఉందంటున్నారు. కరోనా సోకిన రోగుల తరహాలో ఒళ్లు నొప్పులు, శ్వాస సమస్యలతో బాధపడుతున్న రోగులు వారం పది రోజులకు గానీ కోలుకోవటం లేదని తెలుస్తోంది. ఐసీఎంఆర్ సూచన ప్రకారం వైద్యులు, రోగ లక్షణాల ప్రకారం చికిత్స చేస్తున్నారు మినహా అధిక డోసుల మందులు, యాంటీబయాటిక్స్‌ను వాడటం లేదని చెబుతున్నారు. 'ది ఇండియన్ మెడికల్ అసోసియేషన్'(ఐఎంఏ) కూడా ఎక్కువ డోసు కలిగిన మందులు, యాంటీబయాటిక్స్‌ను వాడొద్దని డాక్టర్లకు సూచించింది. హెచ్3ఎన్2 రోగులకు అవసరమైతే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ప్రత్యేక వార్డులను ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నారు.

కొన్ని కేసుల్లో శ్వాస తీసుకోవటానికి ఇబ్బంది ఏర్పడటం, ఆకస్మికంగా ఆక్సిజను శాచురేషను పడిపోతున్న దృష్ట్యా ప్రజలు తగిన ముందు జాగ్రత్తలు పాటించటం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లేటపుడు మాస్క్ ధరించటం తప్పనిసరి చేసుకోవాలని, సమూహాలుగా ఉన్న ప్రదేశాలకు వెళ్లకపోవటం మంచిదని సూచిస్తున్నారు. ఇక తరచూ సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవటం, శానిటైజ్ చేసుకోవాలని చెబుతున్నారు. ఊపిరి తీసుకోవటం ఇబ్బందిగా అనిపించినపుడు, అధిక జ్వరం ఉన్నపుడు వెంటనే సొంత వైద్యం కాకుండా వైద్యుడిని సంప్రదించటం ఉత్తమమని స్పష్టంగా చెబుతున్నారు.

వైరస్ మార్పుతో ఆరోగ్య సమస్యలు



ఫ్లూ వైరల్ మూడేళ్ల కోసారి రూపం మార్చుకుంటూ ఉంటుంది. అలాంటపుడు ఆరోగ్య సమస్యలు తలెత్తటం సహజం. తగిన జాగ్రత్తలు పాటించటం, రోగ లక్షణాలు కనిపించినపుడు వైద్యుడిని సంప్రదించి చికిత్స తీసుకుంటే సరిపోతుంది.

– డాక్టర్ వినీల్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి

కనుల పండువగా అష్టలక్ష్మీ అమ్మవారి మహా శోభాయాత్ర



పురవీధుల్లో అమ్మవారి మహా శోభా యాత్ర



హాజరైన పీఠాధిపతులు, నిర్వాహకులు

తెనాలి: పట్టణ కొత్తపేటలోని శ్రీఅష్టలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో అష్టలక్ష్మీ అమ్మవార్ల 25వ జయంతి, ఆలయ రజతోత్సవాలు కనుల పండువగా ప్రారంభమయ్యాయి. మలయాళ సద్గురు దేవుల అనుగ్రహంతో చేపట్టిన మూడురోజుల పాటు జరగనున్న ఈ వేడుకలు సోమవారం మధ్యాహ్నం అమ్మవారి మహా శోభాయాత్రతో అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. ఏనుగు అంబారీపై అమ్మవారిని అధిష్టింపజేసి పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అష్టలక్ష్మీ పీఠం సంస్థాపకులు దండి స్వాముల ఆధ్వర్యంలో ఆరంభమైన మహాశోభాయాత్ర కొత్తపేటలోని ఆలయం నుంచి ఆరంభమై, ప్రధాన వీధుల్లో కొనసాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు ఊరేగింపును అనుసరించారు. నంబూరు కాళీ వనాశ్రమ పీఠాధిపతులు చంద్రకాళీప్రసాద మాతాజీ, ఉత్సవ నిర్వాహకుడు కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యంతో సహా వివిధ ప్రాంతాల్నుంచి వచ్చిన పలువురు పీఠాధిపతులు పాల్గొన్నారు. తర్వాతి రెండురోజుల ఉత్సవాలు తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఉదయం 4 గంటలకు అమ్మవారికి మహాభిషేకం, 10 గంటలకు షోడశీ యతిపూజ, సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి ఊంజల సేవ, ప్రవచనాలు ఉంటాయి. 8వ తేదీ ఉదయం 6 గంటలకు మహాకుంభాభిషేకం, 10 గంటలకు అమ్మవారికి సహస్ర నామార్చన అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణతో ఉత్సవాలు పూర్తవుతాయని నిర్వాహకులు తెలిపారు.

స్పందనను సద్వినియోగం చేసుకోండి

సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ



అర్జీ స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ

తెనాలి: ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందనను సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ సూచించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలోసోమవారం జరిగిన స్పందనలో ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 11 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. వీటిలో వికలాంగ పింఛను, వినికిడి యంత్రం, ఇంటిస్థలం కోసం, రేషను కార్డులో పేరు విభజన కోరుతూ అర్జీ దాఖలు చేశారు. మురుగు కాల్వ సమస్యపై ఒకరు, ప్లానును అతిక్రమించారంటూ మరొకరు అర్జీలను ఇచ్చారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్యాంపస్ రిక్రూట్ మెంట్‌లో 96 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో కరస్పాండెంట్ సిస్టర్ థెరిస్సామ్మ, ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ తదితరులు

తెనాలి అర్బన్: జేఎంజే మహిళా డిగ్రీ కళాశాలలో భారత్ ఎఫ్ఐహెచ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ సోమవారం నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు గ్రూప్ డిస్‌కర్షన్, ఇంటర్వ్యూలు నిర్వహించారు. వాటిలో 96 మంది ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ థెరిస్సామ్మ, ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీలు తెలిపారు. అనంతరం వారికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ శారద, ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్ డాక్టర్ జి.సుధాకరయ్య పాల్గొన్నారు.

కళాకారుడు ఆంజనేయులుకు సన్మానం



ఆంజనేయులును సన్మానిస్తున్న మల్లికార్జునరావు, విజయ్ రెడ్డి, వీరాంజనేయులు

తెనాలి అర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం ఆడబ్రతుకు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం రామదాసు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక నాటక కళాకారుడు ముతకాని ఆంజనేయులును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మద్ది మల్లికార్జునరావు, పిట్టు విజయ్ రెడ్డి, అప్పల కిషోర్, తిన్నలూరి కొండయ్య, బొంతా వీరాంజనేయులు, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, సోమవరపు సాంబశివరావు, ఎన్టీఆర్ జగన్, గుమ్మడి ప్రసాద్, ముప్పనేని రాఘవరావు, కాకుమాను ఉపేంద్ర, ముళ్లపూడి వెంకట్, ఎన్ రంగారావు, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యసేవలు



ఉచిత వైద్య శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ పవనీప్రియాంక

అమృతలూరు(వేమూరు): రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన శిబిరంలో తెనాలికి చెందిన హ్యాపీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టరు ఉప్పలపు పవనీ ప్రియాంక, డాక్టర్లు అరుణ్‌తేజ్, గురునాథ్ శర్మ, మనోహర్ పేదలకు ఉచిత వైద్యసేవలు అందించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మైనేని రత్న ప్రసాద్, సర్పంచి దేవర కొండ రాము, రెడ్ క్రాస్ సొసైటీ తెనాలి కార్యదర్శి భానుమతి, ప్రతినిధులు నాళ్లం శ్రీమన్నారాయణ, రేణుక, పూజిత, ధనుంజయ్, హాస్పిటల్ సిబ్బంది శెట్టి సురేంద్ర, ఉదయ్ భాస్కర్, పూజ, సాంబయ్య, వాణి పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు

తాడేపల్లిరూరల్: ఆధునిక వ్యవసాయ పద్ధతులలో అధిక దిగుబడి సాధించవచ్చని కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం అన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో వ్యవసాయ పద్ధతులను అనుసరించి పండించిన మిర్చి పంట విలువ ఆధారిత ఉత్పత్తులను విశ్వవిద్యాలయ ప్రో.చాన్సలర్ డాక్టర్ జగన్నాథరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామం నుంచి వచ్చిన మహిళా స్వయం సహాయక బృందం సభ్యుల కృషిని కొనియాడుతూ వారు తయారు చేసిన మిర్చిపొడిని కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మిర్చి రైతులు డ్రిప్ ఇరిగేషన్, ఐఓటీ, మొబైల్ యాప్‌లు వాడడం ద్వారా 25 శాతం అధిక దిగుబడిన సాధించారని, మహిళా స్వయం సహాయక బృందాలు ఈ విలువ ఆధారిత ఉత్పత్తులను తయారుచేసి అమ్మడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందుతున్నారని అన్నారు. ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ బృందాలకు గ్రైండింగ్ మిషన్లు, తూకాలు, కవర్లు, సీలింగ్ మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిశోధన విభాగ డీన్ డాక్టర్ జయకుమార్ సింగ్, నైపుణ్య అభివృద్ధి డీన్ డాక్టర్ శ్రీనాథ్, ఉపాధి కల్పన డీన్ డాక్టర్ ప్రసాద్, విభాగ అధిపతులు డాక్టర్ మురుగన్, డాక్టర్ సుమన్, డాక్టర్ భగవాన్, డాక్టర్ అప్పారావు, డాక్టర్ స్వప్న, డాక్టర్ రాధికారాణి, స్వయం సహాయక బృంద సభ్యులు రేణుకాదేవి, మంగమ్మ, సావిత్రి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: నగర పరిధిలోని నిడమర్రు రోడ్డు విస్తరణ నేపథ్యంలో నిడమర్రు ఎస్సీ కాలనీ శివాలయం ఏరియాలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.